క్లుప్తంగా

విద్యార్థులకు క్విజ్ పోటీలు



జ్ఞాపికను అందుకుంటున్న విజేతలు

బంట్వారం: శిక్షణ ఫౌండేషన్, మైండ్‌ట్రీ ఆధ్వర్యంలో మంగళవారం జెడ్పీహెచ్‌ఎస్ బంట్వారం కాంప్లెక్స్ పరిధిలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. 2023 ప్రేరణ పురస్కారాలు అనే కార్యక్రమంలో భాగంగా పలు ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు క్విజ్ పోటీలకు హాజరయ్యారు. బొప్పునారం యూపీఎస్ విద్యార్థులు గెలుపొంది జ్ఞాపికను అందుకున్నారు. మిగతా పాఠశాలల విద్యార్థులకు ప్రతిభా పురస్కార పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు రాజు, తుల్జప్ప, బీమేష్, అశోక్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదిలోగా వేతనాలు ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నేతలు

అనంతగిరి: గ్రామ పంచాయతీల్లో పనిచేసే ఉద్యోగ కార్మికులందరికీ ప్రతి నెల 10వ తేదీ లోగా వేతనాలు అందేలా చూడాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వికారాబాద్ డీపీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, అందరికీ గుర్తింపు కార్డులివ్వాలని కోరారు. సబ్బులు, నూనెలు, యూనిఫామ్స్ ఏడాదికి రెండు సార్లు ఇవ్వాలని, ప్రమాద బీమా రూ.15లక్షలు ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మికులు అశోక్, భీమయ్య, రవి, బాబయ్య, బుచ్చయ్య, నర్సింహులు, వెంకటయ్య, అనంతయ్య, చంద్రయ్య, బాలయ్య, రవికుమార్ పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా వీరభద్రుడి కల్యాణం

పూడూరు: వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవం మంగళవారం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఘనంగా జరిగింది. ఉత్సవాల సందర్భంగా కంకల్‌లో పండుగ వాతావరణం నెలకొంది. ఉదయం గీతాయజ్ఞం అనంతరం స్వామివారి కల్యాణం జరిగింది. ఉత్సవంలో ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. ఎంపీపీ మల్లేశం, జెడ్పీటీసీ సభ్యురాలు మేఘమాల, సర్పంచ్ సంతోష, నాయకులు నర్సింహులు, వీరన్న, బాలయ్య, వెంకటేశం, సదానందం, పల్లెకుర్వ నర్సింహులు, శ్రీనివాస్ గుప్తా, వినోద్‌రెడ్డి, రమేష్, శివారెడ్డి, బాలమణి, భాస్కర్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, శ్రీశైలంగౌడ్, భక్తులు పాల్గొన్నారు.

హోర్డింగ్ తొలగింపు



హోర్డింగ్‌ను తొలగించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

పరిగి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండల వ్యాప్తంగా హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను అధికారులు తొలగించారు. మంగళవారం 'సాక్షి' దినపత్రికలో 'ఎన్నికల కోడ్ ప్రతిపక్షాలకేనా?' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండల పరిధిలోని రాఘవపూర్ స్టేజ్ సమీపంలోని ఓ హోటల్ భవనంపై పెట్టిన ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి జన్మదిన వేడుకలకు సంబంధించిన హోర్డింగ్‌ను ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ అధికారులు తొలగించలేకపోయారు. ఈ మేరకు 'సాక్షి'లో కథనం రావడంతో అధికారులు హోర్డింగ్‌ను తొలగించారు.

25న న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు

ధారూరు: మండల పరిధిలోని మున్నూరుసోమారం గ్రామంలో ఈనెల 25న ఉదయం 10 గంటలకు న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి డీబీ సీతల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సులో అందరూ పాల్గొనాలని ఆమె చెప్పారు.

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు నేడు చివరి తేదీ

చేవెళ్ల: ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు చేసుకునేందుకు నేడు చివరి తేదీ అని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ టేనావతి తెలిపారు. ఆమె మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ.. ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయడానికి ఈనెల 22 చివరి తేదీ అని తల్లిదండ్రులు గుర్తించాలని చెప్పారు. కావున దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఇప్పటి వరకు దరఖాస్తులు చేసుకోని వారు వెంటనే చేసుకోవాలని సూచించారు.

మా 'తెలుగు' తల్లికి మల్లెపూదండ

- మాతృభాషలో నిండా అమ్మ మమకారమే
- అంతర్జాతీయ తెలుగుభాష దినోత్సవంలో ఉపాధ్యాయులు



కుల్కచర్ల: విద్యార్థులకు సూచనలు చేస్తున్న కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి

కొడంగల్ రూరల్: మాతృభాష కన్నతల్లి లాంటిదని, తెలుగుభాషలో నిండా అమ్మ మమకారమే ఉంటుందని, విద్యార్థులు ఎన్ని నేర్చుకున్నా తెలుగుకు తగిన గౌరవం ఇవ్వాలని ఉపాధ్యాయులు అన్నారు. మాతృభాష దినోత్సవం సందర్భంగా మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులు లక్ష్మణ్, శ్రీనివాసమూర్తిల ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన, ఉపన్యాస, కవితలు, పద్యాలు తదితర పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏటీపీ యేసురత్నం, పాఠశాల ప్రిన్స్‌పాల్ యం.శంకర్‌బాబు మాట్లాడారు. తెలుగు భాష నేర్చుకోవడంతో మన సంస్కృతీ సాంప్రదాయాలు అలవర్చుకోవచ్చునని, పరాయి భాషతో పాటు తెలుగును విద్యార్థులు నేర్చుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయ సిబ్బంది చంద్రశేఖర్, హన్మంతు, మసూద్‌అలీ, నరేష్, సురేష్, హన్మంతు, లక్ష్మీ, అనురాధ పాల్గొన్నారు.

కమ్మనైన భాష..

కుల్కచర్ల: తెలుగు భాషలో ఉన్న మాధుర్యం మరే ఇతర భాషల్లో లేదని కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాల ప్రత్యేకాధికారి దేవి అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన సంస్కృతి, సాంప్రదాయాలను ఎలా గౌరవిస్తామో.. మన భాషను కూడా అదేవిధంగా గౌరవించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్ రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్స్‌పాల్ శంకర్‌బాబు

మైనర్లు వాహనం నడిపితే యజమానిపై కేసు

- సీఐ వెంకటేశం



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ వెంకటేశం, సిబ్బంది

మోమిన్‌పేట: లైసెన్స్ లేనిదే వాహనాలు నడపొద్దని సీఐ వెంకటేశం అన్నారు. మంగళవారం స్థానికంగా నిర్వహించిన వాహనాల తనిఖీలో ఆయన మాట్లాడారు. వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు ఉంటేనే రోడ్డుపైకి వాహనం తీసుకురావాలని సూచించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా పాటించాలని, లేని యెడలా చర్యలు తప్పవని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడిపితే యజమానితో పాటు.. నడిపించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడపడం వలన ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, మత్తులో వాహనాలు నడపరాదని ఆయన చెప్పారు. మద్యం తాగి వాహనం నడిపితే ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, కేసులు నమోదు చేసి కోర్టుకు పంపుతామని సీఐ హెచ్చరించారు. సీఐ వెంట ఎస్‌ఐ విజయ్‌ప్రకాశ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఉత్తమ వ్యవసాయ అధికారికి సన్మానం



ఏఓ నజీరొద్దిన్‌కు సన్మానం చేస్తున్న ఎంపీపీ తదితరులు

పెద్దేముల్: ఉత్తమ వ్యవసాయ అధికారిగా ఎంపికైన పెద్దేముల్ ఏఓ నజీరొద్దిన్‌ను మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అనురాధ, ఎంపీడీఓ లక్ష్మప్పలతో పాటు పలువురు నాయకులు ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే రైతులు అన్ని విధాల అభివృద్ధి చెందుతారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తుందని, రైతుబంధు సకాలంలో అందని వారికి తగిన సలహాలు, సూచనాలు ఇచ్చి, వారిని ఆదుకోవాలని ఎంపీపీ వ్యవసాయ అధికారులకు సూచించారు. ఏఈఓలు రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, రెడోంగి సర్పంచ్ హైదర్, మాజీ ఎంపీటీసీ, సర్పంచ్‌లు రుక్మాపూర్ రమేష్, గోపాల్‌రెడ్డి, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

కోరం లేక సమావేశం వాయిదా

- సమాచారం ఇవ్వనప్పుడు సమీక్షకు రావడమెందుకు: ఎంపీటీసీలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనురాధ

పెద్దేముల్: కోరం లేక మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. గతేడాది నవంబర్ 30న జరగాల్సిన సమావేశం అప్పట్లో పూర్తి స్థాయిలో ఎంపీటీసీ సభ్యులు రాకపోవడంతో వాయిదా వేశారు. ఇప్పుడు మండల అధికారులు మంగళవారం రెండోసారి ఏర్పాటు చేశారు. మొత్తం 13మంది ఎంపీటీసీలకు ఎంపీపీ అనురాధ, తట్టెపల్లి-శంకర్, అడ్కిచెర్ల-ధన్‌సింగ్ వచ్చారు. పెద్దేముల్, మంబాపూర్ గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు అంబరప్ప, యాలటి శ్రీనివాస్‌లు వచ్చి సంతకం చేయకుండా వెళ్లిపోయారు. ఉదయం 11గంటలకు జరగవలసిన మీటింగును మండల అధికారులు, ఎంపీపీ కోరం లేక మధ్యాహ్నం ఒంటి గంట తరువాత వాయిదా వేయడం జరుగుతుందని ఎంపీపీ అనురాధ, ఎంపీడీఓ లక్ష్మప్పలు తెలిపారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు అధికారులు.. తమకు ఎందుకు తెలపడం లేదని, ఎంపీటీసీలపై పోలీస్ కేసులు అవుతున్నా.. మండల నాయకులు ఎందుకు పట్టించుకోవడం లేదంటూ పలువురు ఎంపీటీసీలు అధికారులు, నాయకుల తీరుపై మండి పడ్డారు. ఎంపీడీఓ కార్యాలయంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను కూడా తమకు తెలియకుండా చేయడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. తమకు సమాచారం ఇవ్వనప్పుడు సమీక్షకు రావడం ఎందుకని ప్రశ్నించారు. అధికారులు ఎంపీటీసీలకు విలువ లేకుండా చేస్తున్నారని వాపోయారు. త్వరలో మళ్లీ సమావేశం తేదీని ప్రకటిస్తామని అధికారులు తెలిపారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి

కుల్కచర్ల: ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సర్పంచ్ సౌమ్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం ప్లాస్టిక్ నియంత్రణ, పారిశుద్ధ్య నిర్వహణపై నిర్వహించిన అవగాహనలో వారు మాట్లాడారు. ప్లాస్టిక్ వాడటం వలన కాలుష్యం పెరుగుతుందని చెప్పారు. ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది తమ పరిధిలో ఉన్న ప్రజలకు ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య, స్థానిక వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బీరప్ప జాతర

మోమిన్‌పేట: మండల పరిధిలోని మొరంగపల్లి గ్రామంలో బుధవారం నుంచి బీరప్ప జాతర నిర్వహించనున్నట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. బుధవారం ఉదయం బీరప్ప నూతన విగ్రహాలను గ్రామంలో ఊరేగిస్తామని చెప్పారు. గురువారం విగ్రహ ప్రతిష్ఠ, కల్యాణ మహోత్సవం, శుక్రవారం బీరప్పకు బోనాలు, శనివారం మల్లికార్జున స్వామి బోనాలు, ఆదివారం మల్లికార్జున కల్యాణం, సోమవారం చుక్క మహంకాళీ బోనాలు ఉంటాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

బొంరాస్‌పేట: దుద్యాల మండల పరిధిలోని లగచర్లలో మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. గీతాజ్ఞాన గురుభక్త మండలి ఆధ్వర్యంలో ఎల్‌బీ ప్రసాద్ కంటి ఆస్పత్రి, ఎమ్మెస్ రెడ్డి లయన్స్ క్లబ్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో 100మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో 50మంది ఆపరేషన్‌కు గుర్తించగా.. 35 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. 80మందికి సాధారణ చికిత్స చేశామని సద్గురు రామబ్రహ్మానందస్వామి తెలిపారు. శిబిరంలో డాక్టర్ రవీంద్రయాదవ్, డాక్టర్ వెంకటేశ్వర్లు సాధారణ వైద్య పరీక్షలు, చికిత్స చేశారు. ఈ శిబిరంలో గీతాజ్ఞాన గురుభక్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఆలయ కమిటీ సమావేశం

కొడంగల్: బండల ఎల్లమ్మ ఆలయ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి దేవాలయ విరాళ దాతలు, కమిటీ సభ్యులతో తొలిసారిగా బుధవారం ఉదయం 10 గంటలకు సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు అయ్యప్ప సేవా సమితీ సభ్యులు తెలిపారు. అయ్యప్ప ఆలయ నిర్మాణం ప్రారంభమైనట్లు తెలిపారు. అక్కడే కొత్తగా కార్యాలయం, గోదాము భవనాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. వాస్తు పూజ చేసి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం తగదు

- సీసీరోడ్ల నిర్మాణం త్వరగా పూర్తిచేయాలి
- ఎంపీడీఓ శైలజారెడ్డి



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శైలజారెడ్డి

మోమిన్‌పేట: నర్సరీలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగిన చర్యలు తప్పవని ఎంపీడీఓ శైలజారెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని చక్రంపల్లి గ్రామాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామానికి కేటాయించిన మొక్కలన్నింటినీ పెంచాలన్నారు. ప్రతి సంచిలో మొక్కల విత్తనాలు నాటాలని, విత్తనాలు నాటినప్పటి నుంచి అవసరమైనప్పుడల్లా నీటిని అందించాలని చెప్పారు. నీటిని అందించడంలో నిర్లక్ష్యం చేస్తే.. మొలకలు రావని, అందుకోసం మొక్కలను జాగ్రత్తగా చూసుకోవాలని ఆమె సూచించారు. ఆదే విధంగా ఎన్‌ఆర్‌ఇజీఎస్ పథకం కింద గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, ఆ పనులను వెంటనే పూర్తి చేయాలని చెప్పారు. పనులు ఎంత తొందరగా పూర్తిచేస్తే బిల్లులు కూడా అంత తొందరగా వస్తాయని ఆమె వెల్లడించారు. ప్రతి గ్రామంలో సీసీ పనులు ప్రారంభించాలని ఆమె పేర్కొన్నారు. ఆమె వెంట కార్యదర్శి విక్రంరెడ్డి తదితరులు ఉన్నారు.

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి



ఎన్‌పీఆర్‌డీ జెండా ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

కొడంగల్ రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు దశరథ్ డిమాండ్ చేశారు. మంగళవారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక 13వ వార్షికోత్సవ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఘనంగా నిర్వహించారు. ఎన్‌పీఆర్‌డీ సంఘం పోరాటాల ఫలితంగా 2016లో వికలాంగుల నూతన చట్టాన్ని సాధించడం జరిగిందన్నారు. సంక్షేమ పథకాల్లో 5శాతం వాటా సాధించడం, వికలాంగులకు ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ప్రభుత్వాలు సమస్యలను పరిష్కరించే దిశగా సంఘం ఆధ్వర్యంలో సభ్యులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎన్‌పీఆర్‌డీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు సావిత్రమ్మ, మండల కార్యదర్శి మారుతి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా చెన్నకేశవరెడ్డిని గెలిపించాలి

- పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్



ప్రచారంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్ తదితరులు

బంట్వారం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా చెన్నకేశవరెడ్డిని గెలిపించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం ఆయన కోట్‌పల్లి మండలంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. సంఘం బలపర్చిన అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. చెన్నకేశవరెడ్డిని గెలిపిస్తే చట్టసభలో ఉపాధ్యాయుల సమస్యలు వినిపిస్తారని చెప్పారు. సంఘాలకు అతీతంగా టీచర్లందరూ మద్దతు తెలపాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మారుతి, కోట్‌పల్లి మండల శాఖ అధ్యక్షుడు విశ్వేశ్వర్, ప్రధాన కార్యదర్శి రామకృష్ణగౌడ్, సంఘం నాయకులు మల్లికార్జున్, అశోక్, వెంకటేశం, శ్రీధర్‌రెడ్డి, రామిరెడ్డి, బాలేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు అనుగుణంగా కొనుగోలు

- ధాన్యం తూకంలో మోసం చేయొద్దు
- మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి సారంగపాణి



కందుల కొనుగోలును పరిశీలిస్తున్న సారంగపాణి

మర్పల్లి: మార్కెట్ విధి విధానాలను అవలంభించి, ప్రతి వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపరస్తులు కమీషన్ ఏజెంట్లు, చిరు వ్యాపారులు ధాన్యం క్రయవిక్రయాలు జరపాలని మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి సారంగపాణి వ్యాపారస్తులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మార్కెట్ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్‌తో కలిసి ఆయన తనిఖీ చేశారు. తూకంలో ఎలాంటి మోసాలకు పాల్పడవద్దని, నిబంధనలకు అనుగుణంగా 50 కిలోల ధాన్యం బస్తాకు 1కిలో తరుగు మాత్రమే తీయాలని చెప్పారు. అంతకు మించి తరుగు తీస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం క్రయవిక్రయదారులు తప్పని సరిగా మార్కెట్ నుంచి లైసెన్స్ పొందాలని సూచించారు. అనంతరం మార్కెట్‌లో కమీషన్ ఏజెంట్లు నిర్వహిస్తున్న బీట్లను ఆయన పరిశీలించారు. ధర విషయంలో రైతులు సమ్మతిస్తేనే తూకం వేయాలని, తూకం తాలూకు తక్ పట్టీలు సకాలంలో ఇవ్వాలని ఆదేశించారు. తక్ పట్టీలు ఇవ్వకపోతే కమీషన్ ఏజెంట్ల లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. మార్కెట్ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ మార్కెట్ కమిటీ నిబంధనల మేరకు వ్యాపారులు ధాన్యం క్రయవిక్రయాలు జరపాలని చెప్పారు. విపణిలో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని చెప్పారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, మార్కెట్ సిబ్బంది కమీషన్ ఏజెంట్లు ఉన్నారు.

సకలజనుల పోరాట ఫలితమే తెలంగాణ

- బీఆర్‌ఎస్ ఒక్కటే కొట్లాడితే రాలేదు: బీజేపీ



బీజేపీ భరోసాలో మాట్లాడుతున్న నందకుమార్ యాదవ్

ధారూరు: రాష్ట్రంలోని 33 వేల పోలింగ్ బూత్‌లలో ప్రజాగోస-బీజేపీ భరోసా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నందకుమార్ యాదవ్ అన్నారు. ప్రజాగోస-బీజేపీ భరోసాలో భాగంగా మంగళవారం ధారూరు మండలంలోని కాచారం, మున్నూరుసోమారం గ్రామాల్లో శక్తి కేంద్ర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ప్రజలకోసమే పనిచేయడం లక్ష్యమని చెప్పారు. ప్రపంచంలో అతిపెద్ద పార్టీ బీజేపీ అని, 11 కోట్లు సభ్యత్వం కలిగిన ఏకైన పార్టీ అని చెప్పారు. ఇంటింటికీ వెళ్లి బీజేపీ సిద్ధాంతాలను వివరిస్తూ 11 వేల శక్తి కేంద్రాల్లో సమావేశాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ ఒక్కటే కొట్లాడితే తెలంగాణ రాలేదని, అన్ని పార్టీలు, సకల జనులు పోరాడితే రాష్ట్రం వచ్చిందని ఆయన చెప్పారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్, నాయకులు రవీందర్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, దామోదర్, సుధాకర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

దాడులు అప్రజాస్వామికం

- నిందితులను కఠినంగా శిక్షించాలి
- డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

కుల్కచర్ల: అధికార పార్టీ బీఆర్‌ఎస్ నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ యూత్ పట్టణ అధ్యక్షుడిపై దాడి సంఘటన సర్కారు నియంతృత్వ ధోరణికి, రౌడీయిజానికి నిదర్శనం అన్నారు. దాడులు అప్రజాస్వామికం అని, సర్కారు తన తీరును మార్చుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, ప్రజలు తిరగబడేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. గుండాయిజం, రౌడీయిజంతో ఎన్నోరోజులు పాలించలేరని మండిపడ్డారు. దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కులకచర్ల ఎంపీటీసీ ఆనందం, మాజీ ఎంపీటీసీ అంజిలయ్య, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, నాయకులు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మాయమాటలతో మోసం చేసిన కేసీఆర్

- అన్నీ మోసపూరిత వాగ్దానాలే
- వచ్చేది బీజేపీ ప్రభుత్వమే
- మాజీమంత్రి డాక్టర్ చంద్రశేఖర్, జీవిత రాజశేఖర్



కార్నర్ మీటుంగ్‌లో మాట్లాడుతున్న వికారాబాద్ నియోజకవర్గ పాలక్ జీవిత రాజశేఖర్

అనంతగిరి: తెలంగాణ సెంటిమెంటుతో.. మాయ మాటలు చెబుతూ.. రెండు దఫాలుగా ఈ ప్రాంత ప్రజలను మోసం చేసిన కేసీఆర్‌కు.. ఈ సారి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని మాజీమంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం వికారాబాద్ మండలంలోని కొటాలగుడెం గ్రామంలో శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలతో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతానికి సాగునీరు అందించకుండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మోసం చేశారని విమర్శించారు. దళితులకు మూడు ఎకరాల పొలం ఏమైందని ప్రశ్నించారు. డబుల్ బెడ్ రూంలయితే ఇప్పటికీ నిర్మాణం కూడా పూర్తి కాలేదని ఎద్దేవాచేశారు. ధరణీ వ్యవస్థతో పేద రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని మండిపడ్డారు.

ఆదరణ కలిగిన నాయకుడు మోదీ..

కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సీఎం కేసీఆర్ తమ పథకాలుగా చెప్పుకుంటూ ప్రజల ముందుకు వస్తున్నారని, ఇది ప్రజలంతా గమనించాలని సినీనటి, వికారాబాద్ నియోజకవర్గ పాలక్ జీవిత రాజశేఖర్ విమర్శించారు. ప్రధాని మోదీ నేడు ప్రపంచంలో ఆదరణ కలిగిన నాయకుడిగా ఎదిగారని చెప్పారు. దేశం కోసం అహర్నిషలు పాటుపడుతున్నారని కొనియాడారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ తప్పకుండా అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవన్‌నాయక్, శక్తి కేంద్రాల ఇన్‌చార్జి మల్లేశ్ యాదవ్, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు నవీన్‌కుమార్, పార్లమెంట్ కోకన్వీనర్ అమరేందర్‌రెడ్డి, నాయకులు బస్వలింగం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.